

రైతు వేదికలో డీఏవోపై ప్రశ్నల వర్షం కురిపిస్తున్న రైతులు



మెట్‌పల్లి రూరల్: పంట రుణమాఫీ చేయాలని కోరుతూ మెట్‌పల్లి ఏవో షాహిద్ అలీకి వినతిపత్రం సమర్పిస్తున్న రుణమాఫీ కాని రైతులు



శంకరపట్నం: మొలంగూర్ వద్ద జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

# రుణమాఫీ కోసం రణం

- మాఫీ కాలేదంటూ రైతుల ఆగ్రహం
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిరసనలు
- బ్యాంకుల ఎదుట ధర్నాలు.. అధికారులు, సిబ్బంది నిలదీతలు
- రోడ్లపై బైఠాయింపు.. రాస్తారోకోలు
- సమాధానం చెప్పలేక జారుకున్న అధికారులు

రుణమాఫీ కోసం రైతులు రణం సాగిస్తున్నారు. మూడు విడుతల్లోనూ మాఫీ కాకపోవడంపై భగ్గుమంటున్నారు. మొన్నటి దాకా మొదటి, రెండో, మూడో విడుత అని చెప్పి.. ఇప్పుడు మళ్లీ దాటవేసే ప్రయత్నం చేస్తుండడంపై ఆగ్రహిస్తున్నారు. శనివారం ఉమ్మడి జిల్లాలో ఎక్కడ చూసినా ఆందోళనకు దిగారు. బ్యాంకులకు చేరుకుని.. తమకెందుకు మాఫీ కాలేదని అధికారులు, సిబ్బందిని నిలదీశారు. బ్యాంకుల ఎదుట ధర్నాలకు దిగారు. రోడ్లపైకి చేరుకుని రాస్తారోకోలు చేశారు. అన్ని రకాలుగా అర్హత ఉన్నా మూడు విడుతల్లో తమ పేరు రాలేదని ఆవేదన చెందారు. రుణమాఫీ ప్రక్రియను బీఆర్‌ఎస్ ప్రభుత్వం రెండు సార్లు నిర్వహించిందని, ఏనాడూ ఇటువంటి ఫిర్యాదులు రాలేదని గుర్తుచేశారు. కానీ, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కొర్రీలతో మోసం చేసిందని మండిపడ్డారు. ఇప్పుడు కూడా మాఫీ కాని రైతులకు స్పష్టత ఇవ్వకుండా తిప్పకుంటున్నదని ఆవేదన చెందారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. చాలా చోట్ల రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అధికారులు సైలెంట్‌గా జారుకున్నారు.

## మల్లాపూర్ రైతువేదికలో ఆగ్రహజ్వాల

మల్లాపూర్, ఆగస్టు 17 : రుణమాఫీ సమస్యల పరిష్కారం కోసం శనివారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మల్లాపూర్ రైతువేదికలో అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి డీఏవో వాణి, ఎల్‌డీఎం రాము, ఏడీఏ లావణ్య, మండల పరిధిలోని పలు బ్యాంక్‌ల మేనేజర్లు హాజరయ్యారు. అయితే, మాఫీ కాని రైతులు అక్కడికి చేరుకుని దరఖాస్తులు ఇస్తూ అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. మూడు విడుతల్లో చేయకుండా, మళ్లీ ఇప్పుడు నాలుగో విడుత అనడం ఏంటని ప్రశ్నించారు. డీఈవో స్పందించి, నాలుగో విడుతలో ₹2 లక్షలకు పైగా రుణం కలిగిన రైతులు ₹2 లక్షల పైన ఉన్న నగదు ప్రభుత్వానికి చెల్లిస్తేనే మాఫీ వస్తుందని చెప్పడంతో అక్కడున్న రైతులు ఒక్కసారిగా భగ్గుమన్నారు. రుణమాఫీ కోసం చెప్పులరిగేలా తిరుగుతున్నామని మండిపడ్డారు. 'ఇప్పుడే ₹2 లక్షల పైన ఉన్న నగదు ఇప్పుడే ఇస్తం. వెంటనే మాకు మాఫీ చేస్తరా?' అని ప్రశ్నించారు. కాంగ్రెస్ సర్కార్ అరిగోస పెడుతున్నదని ధ్వజమెత్తారు. చివరికి మల్లాపూర్‌కు చెందిన రైతు ఏలేటి రాజరెడ్డి ఆగ్రహానికి లోనై, అధికారుల ఎదుట పురుగుల మందు డబ్బాతో నిరసన తెలిపాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ కిరణ్‌కుమార్ సిబ్బందితో చేరుకొని రైతులను శాంతింపజేసే ప్రయత్నం చేయగా, వారు ససేమిరా అన్నారు. చివరికి సమావేశం మధ్య నుంచే డీఏవో, బ్యాంక్ అధికారులు వెళ్లిపోయారు. డీఏవో కారులో వెళ్లేటప్పుడు సైతం రైతులు తమ సమస్యలను పరిష్కరించాలని దరఖాస్తులు అందజేశారు. ఆమె కారుకు సైతం రైతులు అడ్డురావడంతో చేసేదేమీ లేక పోలీసుల వాహనంలో వెళ్లిపోయారు.



సమావేశం నుంచి వెళ్లిపోతున్న జిల్లా వ్యవసాయాధికారి

### పైన పైసలు కడితేనే మాఫీ చేస్తుందా..?



రుణమాఫీ విషయంలో విడుతల పేరిట సర్కార్ కాలం వెల్లదీస్తున్నది. డీఏవో వాణి మేడం ₹2 లక్షలకుపైగా రుణం ఉన్న రైతులు ఆ మీది పైసలు కట్టి ఆ రసీదును వ్యవసాయ శాఖ కార్యాలయంల అందిస్తేనే మాఫీ అయితదని చెప్పింది. నేను, నా భార్య కలిసి మల్లాపూర్ యూనియన్ బ్యాంక్‌ల ₹3 లక్షల మేర రుణం తీసుకున్నం. నేను ఇప్పుడు పైన ఉన్న ₹లక్ష డీఏవో ముందు చెల్లిస్త. లేకుంటే ఇక్కడికి వచ్చిన ఎస్‌ఐకి ఇవ్వమన్నా ఇస్త. కానీ, నాకు మాఫీ ఎప్పుడు చేస్తరో క్లారిటీగా చెప్తరా? స్పష్టత ఇవ్వకుండా సర్కారు ఆగం చేస్తున్నది. అసలు ₹లక్ష, ₹1.50 లక్షల రుణమాఫీనే ఇంకా చాలా మందికి కాలేదు. ఇప్పుడు ఏవో నిబంధనలు చెప్పి ₹2 లక్షల రుణం ఉన్న రైతులు మీది పైసలు కట్టాలి అని అనడం మోసం చేసినట్టే.

**- ఏలేటి రాజరెడ్డి, రైతు (మల్లాపూర్)**

## ఒక్క రోజే 600 దరఖాస్తులు

ఇల్లంతకుంట, ఆగస్టు 17 : మూడో విడుతలోనూ రుణమాఫీ కాకపోవడంతో రైతులు ఆగమవుతున్నారు. వ్యవసాయ కార్యాలయల వద్దకు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. శనివారం ఇల్లంతకుంట వ్యవసాయ కార్యాలయంలో సుమారు 600 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయాన్ని వ్యవసాయ విస్తీర్ణ అధికారులు తెలిపారు. మూడో విడుతలో ₹2 లక్షల రుణమాఫీ కానివారు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. రైతులు తీసుకున్న రుణం వడ్డీతో కలిపి ₹2 లక్షల పై చిలుకు ఉన్న వారికి కాలేదని, ప్రభుత్వం నుంచి వచ్చే సమాచారం మేరకు మిగతా రుణమాఫీపై స్పష్టత వస్తుందన్నారు.



ఇల్లంతకుంట : మండల వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటున్న రుణమాఫీ కాని రైతులు

## మొలంగూర్ బ్యాంకు ముట్టడి

శంకరపట్నం, ఆగస్టు 17 : శంకరపట్నం మండలం మొలంగూర్ ఇండియన్ బ్యాంకు నుంచి 14 గ్రామాలకు చెందిన 1400 మంది రైతులు రుణాలు తీసుకున్నారు. అందులో ఇప్పటివరకు మూడు విడుతల్లో కలిపి 311 మందికి మాత్రమే రుణమాఫీ అయింది. ఇంకా 987 మందికి రుణమాఫీ కాలేదు. అందులోనూ కన్నాపూర్, గద్దపాక, మొలంగూర్, ఆముదాలపల్లి గ్రామాల్లో 20 శాతం మంది కూడా కాలేదు. దీంతో ఆగ్రహించిన ఆ 14 గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులు శనివారం మొలంగూర్ ఇండియన్ బ్యాంకును ముట్టడించారు. తమకెందుకు రుణమాఫీ కాలేదంటూ బ్యాంక్ మేనేజర్‌తో వాగ్వాదానికి దిగారు. సహనం కోల్పోయి ఓ దశలో బ్యాంక్ షట్టర్ మూసి, బ్యాంక్ ఎదుట ధర్నా చేపట్టారు. 'బ్యాంక్ మేనేజర్ డౌన్ డౌన్.. మేనేజర్‌ను సస్పెండ్ చేయాలి. అధికారులు సమాధానం చెప్పాలి' అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులతోపాటు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని బ్యాంక్ మేనేజర్ హామీ ఇచ్చినా వినిపించుకోలేదు. 20 రోజులుగా బ్యాంక్ సిబ్బంది ఇదే మాట చెప్పారని, అయినా తమకు మాఫీ కాలేదని వాపోయారు. అనంతరం మొలంగూర్ క్రాస్ రోడ్డు కరీంనగర్-వరంగల్ రహదారిపై జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు. తమకు న్యాయం జరిగే దాకా ఇక్కన్నుంచి కదిలేది లేదని భీష్మించారు. పోలీసులు వచ్చి నచ్చజెప్పినా కదలలేదు. అధికారులు హామీ ఇచ్చేదాకా కదలబోమని తేల్చి చెప్పారు. దీంతో వెంటనే ఏవో వచ్చి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఏవోను వెంట బెట్టుకొని తిరిగి ఇండియన్ బ్యాంక్ వద్దకు వెళ్లారు. అక్కడ మరోసారి మేనేజర్‌తో మాట్లాడి స్పష్టమైన హామీ ఇవ్వడంతో శాంతించి వెనుదిరిగారు.

### నికురం లేని మాటలు చెప్తున్రు



నేను పోయినేడు పెట్టుబడి కోసం ఇండియన్ బ్యాంక్‌ల ₹90 వేలు తీసుకున్నం. కండ్లు కాయలు కాసేలా చూస్తున్నం. బ్యాంకులకు పోయి అడిగితే రెండో విడుత అన్నరు. మళ్లా అడిగితే మూడో విడుతల వస్తది పోండ్రి అన్నరు. తీరా చూస్తే మీ పేరే లేదు అన్నరు. నికురం లేని మాటలు చెప్పవట్టిరి. మరి ఏంజెయ్యాలె. ఎవలను అడగాలె. అధికారులకు రైతులంటే లోకువ ఉన్నది. గట్టిగ అడిగితే మెడలు పట్టి నూకుతన్రు.

**- మేడుదుల తిరుపతి, నల్లవెంకయ్యపల్లె (శంకరపట్నం)**

### ఈ సర్కారు ఫెయిల్



నేను మొలంగూర్ ఇండియన్ బ్యాంకుల ₹లక్షా యాభై వేలు అప్పు తీసుకున్న. మాఫీ అన్నరు కానీ, అందరికీ కాలే. తిరిగీ తిరిగి కాళ్లరిగినయ్. రుణమాఫీల ఈ సర్కారు ఫెయిల్ అయింది. మొలంగూర్ ఇండియన్ బ్యాంక్‌ల ఒక్క 90 శాతం మందికి అప్పు మాఫీ కాలే. మరి ఈ సర్కారు ఎవరికి మాఫీ చేసినట్టు? బ్యాంకోళ్లను, అధికారులను ఎవ్వలను అడిగినా అందరూ తప్పించుకునుడే. ఇయ్యాలటి మాటలు అధికారులు ఎంతవరకు నిలబెట్టుకుంటరో చూస్తం. మాకు మాఫీ అయ్యేదాకా ఇడువం. బ్యాంక్ ముందు రోజూ వచ్చి కూర్చుంటం.

**- ఇరుమల్ల మాధవరెడ్డి, కాచాపూర్ (శంకరపట్నం)**

### ఎవరు బాధ్యత వహిస్తరు?



మాకు మా ఊరి శివారుల రెండెకురాల భూమి ఉన్నది. పోయినేడు ₹1.25 లక్షలు అప్పు తీసుకున్న. రెండో విడుతల మాఫీ కాలేదని పోయి మేనేజర్‌ను అడిగిన. నీకు మూడో విడుతల గ్యారెంటీగా మాఫీ అయితదిపో అన్నడు. తర్వాత ఎందుకైనా మంచిది ఓసారి ఏవోను కూడా కలువు అన్నడు. ఆధార్ కార్డు పట్టుకొని నాతో పాటు 20 మందిమి అక్కడికి పోయినం. ఏవో ఆఫీసుల జాబితాల మా పేర్లే లేవన్నరు. బ్యాంకోళ్లు మీ పేర్ల లిస్ట్ పంపలేదని చెప్పిన్రు. ఇప్పుడు నేను ఎవలను అడగాలె. అధికారులు బాధ్యత వహిస్తరా..? లేక ప్రభుత్వం న్యాయం చేస్తదా..? ఎవరి బాధ్యత వహిస్తరు?

**- పొద్దుటూరి భాస్కర్‌రెడ్డి, నల్లవెంకయ్యపల్లి (శంకరపట్నం)**



బ్యాంక్ ఎదుట ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

## ఆసిఫ్‌నగర్‌లో ఆందోళన

కొత్తపల్లి, ఆగస్టు 17 : కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్ గ్రామంలోని ఇండియన్ బ్యాంకు శాఖలో ఆరు గ్రామాలు అంటే.. ఆసిఫ్‌నగర్, కమాన్‌పూర్, ఎలగందుల, బద్దిపల్లి, కాజీపూర్, నాగులమల్యాల గ్రామాలకు చెందిన 1280 మంది రైతులు రుణం తీసుకున్నారు. మూడు విడుతల్లో 432 మందికి మాత్రమే రుణమాఫీ అయింది. ఇంకా 848 మందికి మాఫీ కావాల్సి ఉన్నది. దీంతో ఆయా గ్రామాల రైతులు ఆగ్రహించారు. బ్యాంకు షటర్ మూసేసి ఆందోళన చేశారు. రేషన్‌కార్డు ఉన్నా లిస్ట్‌లో పేరు లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. దేశానికి అన్నంపెట్టే రైతాంగాన్ని మోసం చేస్తే ఊరుకునేది లేదని, సీఎం రేవంత్‌రెడ్డికి తగిన బుద్ధిచెబుతామని హెచ్చరించారు.

### ₹40వేలు కూడా మాఫీ కాలే



నేను ఏడాది కిందట ఆసిఫ్‌నగర్ ఇండియన్ బ్యాంకుల ₹30వేల పంట రుణం తీసుకున్న. మొదటి విడుత రుణమాఫీ జాబితాలో నా పేరు రాలేదు. అధికారులను అడిగితే మళ్లో తాప అత్తదన్నరు. మొన్న ఇచ్చిన లిస్ట్‌ల కూడా నా పేరు లేదు. బ్యాంక్‌కు వచ్చి చూసుకుంటే లోన్ డబ్బులు జమకాలేదని చెప్పిన్రు. ప్రభుత్వం రైతులకు ఆశ చూపి మోసం చేయడం ఎంత వరకు కరెక్ట్.

**- బుర్ర రాములు, కొండాపూర్ (కొత్తపల్లి)**

### అంతా గందరగోళం



ప్రభుత్వం చేసిన రుణమాఫీ అంతా గందరగోళంగా ఉన్నది. నాకు ₹80వేల రుణం ఉన్నా మాఫీ కాలె. బ్యాంక్ అధికారులు, వ్యవసాయ అధికారులు మాకేం తెలియదు అంటున్నరు. ప్రభుత్వం చేస్తే అందరికీ చేయాలె. లేకుంటే లేదు. కనీ ఇట్ల గోస పెట్టవద్దు.

**- గాండ్ల రాజు, కొండాపూర్ (కొత్తపల్లి)**

## వేంపేటలో ధర్నా

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 17 : వేంపేట కెనరా బ్యాంకు శాఖ పరిధిలో 2వేల మంది రుణాలు తీసుకున్నారు. అందులో మెట్‌పల్లి మండలం వేంపేట, చింతలపేట, మల్లాపూర్ మండలం సాతారం, ధర్మారం, చిట్టపూర్ గ్రామాలకు చెందిన రైతులు ఉన్నారు. మొత్తం 1021 మందికి రుణమాఫీ జరగగా.. ఇంకా 979 మందికి ఇంకా కావాల్సి ఉన్నది. దీంతో రుణమాఫీకాని రైతులు ఆగ్రహించారు. వందలాదిగా తరలివచ్చి వేంపేట కెనరా బ్యాం కు ఎదుట ధర్నాకు చేశారు. పాసుబుక్కులను చూపుతూ నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇప్పటికైనా సర్కారు స్పందించి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏవోకు వినతిపత్రం సమర్పించారు.

### రేషన్‌కార్డు ఉన్నా మాఫీ కాలే



నాకు నాలుగెకరాల భూమి ఉన్నది. 2022లో వేంపేట కెనరా బ్యాంకులో ₹1.99 లక్షల పంట రుణం తీసుకున్న. గడువుకు ముందే రెన్యువల్ కూడా చేసిన. ప్రభుత్వం మొన్న విడుదల చేసిన ₹2 లక్షల మాఫీ జాబితాలో నా పేరు లేదు. నాకు తెల్ల రేషన్ కార్డు ఉన్నది. బ్యాంకు మేనేజర్, వ్యవసాయాధికారులను అడిగితే తెలియదంటూ దాటవేస్తున్నరు.

**- మారు నరేందర్‌రెడ్డి, వేంపేట (మెట్‌పల్లి)**

### రుణమాఫీ లిస్ట్‌ల పేరులేదు



నేను 2019లో వేంపేట కెనరా బ్యాంకులో ₹1.50 లక్షల పంట అప్పు తీసుకున్న. దీనికి వడ్డీ ₹10 వేలు కలుపుకొని ₹1.60 లక్షలు రుణ బకాయి ఉన్నది. ఎన్నికల ముంగట కాంగ్రెస్ రుణమాఫీ ప్రకటిస్తే సంబురపడ్డ. కానీ, ప్రభుత్వం మొన్న విడుదల చేసిన లిస్ట్‌లో నా పేరు రాలేదు. మేనేజర్‌ను అడిగితే నాకేం తెలియదు. వ్యవసాయ అధికారుల వద్దకు వెళ్లమంటున్నడు.

**- గోపిడి మధు, చింతలపేట (మెట్‌పల్లి)**

### ప్రభుత్వం మాటతప్పింది



నాకున్న ఐదెకరాల భూమిపై వేంపేట కెనరా బ్యాంకులో ₹1.40 లక్షల లోన్ తీసుకున్న. ప్రభుత్వం రెండో విడుతలో ₹1.50 లక్షల లోపు రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పింది. కానీ, రెండుసార్లు విడుదల చేసిన జాబితాలో నా పేరు లేదు. రేషన్‌కార్డు కూడా ఉన్నది. కానీ మాఫీ ఎందుకు కాలేదో ఎవరూ చెప్పడం లేదు. ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పింది.

**- బైరి లక్ష్మీనర్సయ్య, వేంపేట (మెట్‌పల్లి)**









## న్యాయం కోసం వైద్యుల కదం




కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వైద్యులు, మెడికోలు, సిబ్బంది, మెడికల్ రిప్‌లు

- కోల్‌కతా ఘటనకు నిరసనగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఓపీ సేవలు బంద్
- అంతటా ర్యాలీలు
- కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా

కరీంనగర్ విద్యానగర్, ఆగస్టు 17: కోల్‌కతాలోని ఆర్‌జీకార్ దవాఖానలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచార ఘటనపై ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా వైద్యులు ఆగ్రహించారు. ఐఎంఏ పిలుపు మేరకు శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు ఓపీ సేవలను బంద్‌పెట్టి ఆందోళనకు దిగారు. వందలాదిగా రోడ్లపైకి వచ్చి ర్యాలీలు తీశారు. కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట రెండు వేల మంది డాక్టర్లు, మెడికోలు బైఠాయించి నిరసన తెలిపారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాంకిరణ్, డాక్టర్ వెంకట్‌రెడ్డి మాట్లాడారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వెంటనే ఈ కేసును సీబీఐకి అప్పగించాలన్నారు. దవాఖానల్లో మహిళా వైద్యసిబ్బందికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. పాలకుల ఉదాసీనతతోనే మహిళా వైద్యులు, నర్సింగ్, ఆరోగ్య సిబ్బందిపై భౌతిక దాడులు, నేరాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరుపకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. చల్మెడ, ప్రతిమ వైద్య కళాశాలల వైద్యులు, మెడికోలతోపాటు మెడికల్ రిప్‌లు పాల్గొనగా, న్యాయవాదులు, ఉపాధ్యాయులు సంఘీభావం ప్రకటించారు.